క్లుప్తంగా

సాగు నీటి కాలువ బాగు చేయండి

టెక్కలి: టెక్కలి మండలం అక్కవరం సమీపంలోని 46–ఎల్ఆర్ కాలువకు మరమ్మతులు చేసి సాగునీరు అందజేయాలని అక్కవరం, శ్యామసుందరాపురం గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయం అధికారులను బుధవారం కలిసి విన్నవించారు. మేఘవరం వరకు ఎటువంటి పని చేయకపోవడంతో ప్రస్తుతం సాగునీరు అందడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమ గ్రామాలకు సాగునీరు అందజేయాలని విన్నవించారు.

మంచినీటి సరఫరాకు చర్యలు



పైపులైన్ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న మంచినీటి పైపులైను మరమ్మతులకు గురైంది. దీంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సంబంధిత సిబ్బందితో బుధవారం వెళ్లి పరిశీలించారు. పద్మనాభపురం వద్ద పైపులైను మరమ్మతులు చేపట్టించారు. నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.రామారావు, డీఈ కనకరాజు, ఏఈ కిరణ్‌కుమార్ ఉన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.వెంకటరావు అన్నారు. లొద్దపుట్టిలో పంచాయతీలో వైద్య సిబ్బందితో కలిసి దోమల నివారణకు బుధవారం ఇంటింటికీ వెళ్లి మందులను పిచికారీ చేశారు. నూతుల్లో క్లోరినేషన్ చేపట్టారు. జ్వరాలు, దగ్గు, జలుబు ఉన్న రోగులను గుర్తించారు.

మున్సిపల్ కార్మికుల సంఘం కార్యవర్గం ఎన్నిక



సంఘ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపల్ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం సంఘ సమావేశం జరిగింది. అధ్యక్షునిగా రమేష్ పట్నాయక్, ఉపాధ్యక్షునిగా హుద్దిబో మద్ది, కార్యదర్శిగా డిల్లి, సహాయ కార్యదర్శిగా డి.లక్ష్మణరావు, కోశాధికారిగా ఎన్.హరికృష్ణ, సభ్యులుగా సంతోష్, సురేంద్ర్ రతో, బృందబంగారి బాలరాజు, రవిప్రసాద్, కృష్ణారావు, టి.జనార్దన, శ్రీకాంత్, దుర్గాశి సత్యం ఎన్నికయ్యారు.

మారిన సిలబస్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీవీఈవో దుర్గారావు

పలాస: ఇంటర్మీడియెట్‌లో మారిన సిలబస్‌పై విద్యార్థులకు తగిన అవగాహన కల్పించాలని ఇంటర్ విద్య ఇన్‌చార్జి డీవీఈవో దుర్గారావు అధ్యాపకులకు సూచించారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్ ప్రథమ ఏడాది సిలబస్‌లో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో తగిన సూచనలు చేస్తూ విద్యార్థులకు వీటిపై తగిన విధంగా అవగాహన కల్పించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

టెక్కలి: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఎస్.సుకన్య, జి.చైతన్య సూచించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఆరోగ్యం–సామరస్యం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల్లో తరచూ వచ్చే చిన్నపాటి ఆరోగ్య సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అంతకు ముందు హృదయ సంబంధిత వైద్యులతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

నేడు సురేఖా పాణిగ్రాహి సంతాప సభ

పలాస: శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు, విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి సతీమని సురేఖా పాణిగ్రామి సంతాప సభ పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు, నిర్వాహణ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు.

గౌరవం లేదు.. వేతనం రాదు!

- డమ్మీలుగా మిగిలిన ఎంపీటీసీ సభ్యులు
- ప్రభుత్వ కార్యక్రమాలకు అందని ఆహ్వానాలు
- 24 నెలలుగా అందని గౌరవ వేతనం



మండల సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు

వజ్రపుకొత్తూరు:

దేశంలో మొట్టమొదటి పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన రాష్ట్రంగా రాజస్థాన్ నిలవగా తరువాత ఆంధ్రప్రదేశ్ ఉంది. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచనల మేరకు దేశంలో మూడంచెల వ్యవస్థను ప్రవేశ పెట్టారు. 1995లో అప్పటి కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ వ్యవస్థను ప్రవేశ పెట్టింది. దీంతో పరిపాలన సజావుగా సాగుతుందని భావించింది. ఈ దిశగానే నిధులు కూడా కేటాయించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎంపీటీసీ సభ్యుల పాత్ర నామామాత్రమైపోయింది. నిధులు రావు.. పనులు కావు అనే సందేహంలో వీరు కొట్టుమిట్టాడుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం ఆహ్వానించడం లేదు సరికదా.. గౌరవ వేతనాన్ని కూడా ఇవ్వడం లేదు.

నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం

ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాల కోసం నిధులు కేటాయింపులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి మందగించింది. దీంతో పనులు చేయలేక ముఖం చాటేసుకుంటున్నారు. గతంలో బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం జిల్లా పరిషత్‌కు కేటాయించారు. వీటితో గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎంపీటీసీ సభ్యులు చేయించేవారు. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. 14వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీలకే కేటాయించారు. పంచాయతీలకు నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వాలు ఎంపీటీసీలకు మాత్రం నిధులు కేటాయించడం లేదు. పేరుకు మాత్రమే సభ్యులుగా ఉంటున్నారు.

24 నెలలుగా అందని వేతనాలు

పలాస నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 85 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతీ నెల రూ. మూడు వేలు గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత హయాంలో రెండు విడతల్లో గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో మూడో విడత నిధులు మంజూరు చేసే అవకాశం లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిపోవడంతో సంబరాలు చేసుకుంటోంది తప్పా.. తమ గురించి పట్టించుకోవడంతేదని ఎంపీటీసీ సభ్యులు విమర్శిస్తున్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. దీంతో ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనం బిల్లులు పెడుతున్నామని అధికారులు చెబుతున్నారే తప్పితే వారి ఖాతాల్లో వేతనాలు జమ కాలేదు. ప్రజల చేత ఎన్నుకోబడిన తమకు అధికారులు ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదని, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో టీడీపీ, జన సేన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తూ రాజకీయ కోణం చూస్తూ తమను పట్టించుకోవడ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికశాతం ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే కావడంతో కూటమి సర్కార్ పట్టించుకోవడలేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి సర్పంచ్‌లకు కూడా కూటమి సర్కార్ గౌరవ వేతనం నిధుల విడుదల చేయలేదు.

సమస్యలపై స్పందంచలేకపోతున్నాం



మాకంటూ ప్రత్యేక నిధులు లేకపోవడంతో అభివృద్ధిలో భాగస్వామ్యం కాలేకపోతున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతున్నాం. గ్రామంలో చిన్న సమస్యను పరిష్కరిచాలన్నా నిధులు ఉండాలి. వేతనాలు సైతం ఇవ్వడం లేదు. చేతకాని దద్దమ్మ ప్రభుత్వం గ్రామాల్లో సుపరిపాలన అందించకుండా రాక్షసానందం పొందుతోంది. రెడ్ బుక్ పాలనతో అభివృద్ధి కుంటుపడుతోంది.

– తమ్మినేని శ్రావణి, వైస్ ఎంపీపీ, బెండి గ్రామం

వివక్ష చూపుతున్నారు



ప్రభుత్వ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే సమయంలో టీడీపీ కార్యకర్తలకు ఇస్తున్న విలువ ఎంపీటీసీ సభ్యులకు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారు. టీడీపీ నేతలకే అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం బాధాకరం. ప్రజల చేత ఎన్నుకోబడిన తమ హక్కులను కూటమి ప్రభుత్వం హరిస్తోంది. గౌరవ వేతనం సైతం ఇవ్వడం లేదు. తమను సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు కేటాయించిన నిధులు నిలిపి వేయడంతో గ్రామ సమస్యలు తీర్చలేకపోతున్నాం.

– సొదాల వెంకన్న, ఎంపీటీసీ సభ్యుడు, దేవునల్తాడ

తీరప్రాంత భద్రతపై అవగాహన



తీరప్రాంత భద్రతపై మత్స్యకారులు అవగాహన కలిగి ఉండాలని సోంపేట మండలం బారువ మెరైన్ సీఐ వి.రమేష్ అన్నారు. తీరప్రాంత భద్రతపై బారువ కొత్తూరు గ్రామంలో మత్స్యకారులతో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకారుల భద్రత, సముద్ర మార్గం గుండా చొరబాటుదారుల నిఘా, ముందస్తు సమాచారంపై వివరించారు. మెరైన్ ఏఎస్సై కొదండరావు, గ్రామ రెవెన్యూ అధికారి భగీరథి, ఫిషరీష్ అసిస్టెంట్ హేమలత, సాగర మిత్ర హైమావతి పాల్గొన్నారు. –సోంపేట

మట్టి విగ్రహాలను పూజిద్దాం



వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను పూజిద్దామని కంచిలి మండలం బూరగాం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోరారు. కోరుతున్నారు. ఈ మేరకు గ్రామంలోని ఇంటింటికీ బుధవారం వెళ్లి మట్టి విగ్రహాలను పూజిద్దామని అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ చేసి పర్యావరణాన్ని కాపాడుదామని, మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని నినాదాలు చేశారు. –కంచిలి

విద్యార్థులకు పోటీలు



విద్యార్థుల్లో అంతర్గతంగా దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వివిధ రకాలపోటీలు ఎంతగానో దోహదపడతాయని ఇచ్ఛాపురంలోని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మోహన్ వెంకటేష్ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో న్యూ జనరేషన్ మంత్ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, చక్కని చేతిరాత పోటీలను బుధవారం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు పి.దినేష్, కె.రామారావు, బత్తుల షణ్ముఖ, కృష్ణారావు, మాటూరు నవీన్ పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి



అవగాహన కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు

ఇచ్ఛాపురం టౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలని వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేసీఐ ఆధ్వర్యంలో విద్యార్థులు లక్ష్యం సాధించేందుకు ఎలా కృషి చేయాలో అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ది గోల్ ఇంజన్ అనే అంశంపై జేసీఐ జోన్ ట్రైనర్ ఈశ్వరరావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. లక్ష్యం సాధించేందుకు ఆలోచనా దృక్పథం, మానసికస్థితి మెరుగు పరుచుకునే విధానం గురించి వివరించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జేసీఐ అధ్యక్షుడు కె.జయదేవ్, సెక్రటరీ మోహన్, సభ్యులు వెంకటేష్, షణ్ముక, సంతోష్, అధ్యాపకులు లోకేష్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

10వ తేదీ నుంచి 'ఉపాధి'లో ముఖ ఆధారిత హాజరు



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి హామీ పథకంలో అవకతవకలు నిరోధించడానికి ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు (ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్) విధానాన్ని ప్రవేశపెట్టిందని ఏపీడీ చల్లా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు చెందిన ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు బుధవారం ఒక్కరోజు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారుల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయడం ద్వారా దొంగ హాజరును అరికట్టవచ్చని అన్నారు. ఈనెల నెల పదో తేదీ నుంచి కొత్త హాజరు నమోదు విధానం అమల్లోకి వస్తుందన్నారు. నెయ్యిల నీలంబర్, దక్కత పితంబర్‌లు మాస్టర్ ట్రైనీలుగా శిక్షణ ఇచ్చారు. ఏపీవోలు పి.శ్రీనివాసరావు, తలగాన మోహనరావు, ఈసీలు పాల్గొన్నారు.

సోలార్ లైట్ సిస్టం వితరణ

కంచిలి: పురుషోత్తపురం గ్రామ ప్రాథమిక పాఠశాలకు సోలార్ లైట్ సిస్టంను ఎస్.ఆర్.సి.పురం మెయిన్‌రోడ్డు వ్యాపారవేత్త కిల్లంశెట్టి మోహనరావు వితరణగా ఇచ్చారు. రూ. 11 వేలు విలువల గల పరికరాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదకు అందజేశారు. ఈ ప్రక్రియను యువకుల సాయంతో అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఆర్టీసీ బస్సుల ఫిట్‌నెస్ పరిశీలన

పలాస: పలాస ఆర్టీసీ డిపోలోని బస్సుల ఫిట్‌నెస్‌ను విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు కె.శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న మహిళలకు ఉచిత బస్సు పథకంలో భాగంగా బస్సులను పరిశీలించి మెయింటినెన్సు విషయాలను తెలుసుకున్నారు. అసిస్టెంటు ఇంజినీరు చాణిక్య, డిపో మెకానికల్ ఇంజినీరు హేమంత్‌కిషోర్ ఉన్నారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి: దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి మండల వేణు బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇతని వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్టు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలు తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన బెండి రామరాజు సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్న జనసేన అనుచరులు తన మిత్ర బృందానికి తెలియజేశారు. దీంతో రెండు రోజుల్లో లక్ష రూపాయలు విరాళాలుగా సేకరించారు. ఈ మొత్తాన్ని విద్యార్థిని కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

దాడులతో అల్లర్లు ప్రేరేపిస్తున్నారు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్
- ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి నిరసనగా నేడు శాంతి ర్యాలీ

టెక్కలి: రాష్ట్రంలో కూటమి పాలనపై ప్రజల నుంచి తిరుగుబాటు రావడంతో ప్రతిపక్ష నాయకులపై దాడులు చేసి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. ఇందులో భాగంగానే పులివెందులలో వెనుకబడిన వర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌తో పాటు మరో నాయకుడు రామలింగారెడ్డిపై విచక్షణ రహితంగా దాడులు చేసి హత్య చేయాలని చూశారని మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని తిరిగి వస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌కుమార్ యాదవ్, పార్టీ నాయకుడు రామలింగారెడ్డిపై కార్లతో వెంటాడి మరీ దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కేవలం ఓటమి భయంతోనే అల్లర్లు సృష్టించి భయాందోళన కలిగించాలనే కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. పథకం ప్రకారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తిలక్ పేర్కొన్నారు. ఈ సంఘటనకు నిరసనగా గురువారం సాయంత్రం టెక్కలిలో శాంతి ర్యాలీ చేయనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబసభ్యులకు సామగ్రి అందజేస్తున్న పేరాడ తిలక్

నందిగాం: హర్షబడ పంచాయతీ పెద్దగురువూరులో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో పెద్దింటి జానకీరాం కుటుంబం నష్టపోయింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించించి నష్టం వివరాలను బాధితులను పరామర్శించారు. ప్రమాద సమాచారాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. బాధిత కుటుంబానికి అత్యవసరమైన దుస్తులు, వంట సామగ్రి, బియ్యం, దుప్పట్లు అందజేశారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, నందిగాం మహేష్, బూరె మోహనరావు, చిన్ని జోగారావు, రేగల కూర్మారావు, నందిగాం శ్యామసుందరరావు, తమిరె రాజ్, అంబోడి విష్ణు,బొడ్డపాటి తిరుపతిరావు, బార్నాన బాబూరావు,బార్నాన జోగారావు ఉన్నారు.

అర్చకుని కుటుంబానికి చేయూత

సోంపేట: పలాసపురం గ్రామానికి చెందిన నిరుపేద బ్రాహ్మణుడు అశోక్ పాణిగ్రాహి ఇటీవల మృతి చెందాడు. దీంతో ఈ కుటుంబాన్ని ఆదుకోవడానికి సోంపేట తాలుకా ఒడియా బ్రాహ్మణ అర్చక సంక్షేమ సంఘ ప్రతినిధులు ముందుకువచ్చారు. దాతల సహకారంతో ఒక లక్షా పది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. సంఘ అధ్యక్షులు గాంధీజీ పాణిగ్రాహి, ప్రధాన కార్యదర్శి సింహాచలం పాడి, కార్యదర్శి రమేష్‌కుమార్ పాణిగ్రాహి, కూర్మనాథ పాణిగ్రాహి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మైదానాన్ని పట్టించుకోరా?

- సౌకర్యాలకు నోచుకోని మందస జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, క్రీడాకారులు



పిచ్చిమొక్కలతో ఉన్న మైదానంలోనే అగ్నివీర్ ఉద్యోగాల కోసం ప్రాక్టీస్ చేస్తున్న యువకులు

మందస:

మందస మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. మైదానం సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులతోపాటు వివిధ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ మైదానమంతా పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా దర్శనమిస్తుంది. అలాగే మేకలు, గొర్రెలు, పశువులు మైదానంలోనే తిష్ట వేస్తున్నాయి. అలాగే కనీసం 800 మీటర్ల రన్నింగ్ ట్రాక్ కూడా లేకపోవడంతో క్రీడాకారులు ప్రాక్టీస్ కోసం అవస్థలు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ మైదానం బాగానే ఉండేది. దీంతో మందసతో పాటు సమీపం గ్రామాలకు చెందిన యువకులు వచ్చి క్రీడల్లో ప్రాక్టీస్ చేయడంతోపాటు నిరుద్యోగులు ఆర్మీ, నేవి, పోలీసు ఉద్యోగాల కోసం ఇక్కడే ప్రాక్టీస్ చేసేవారు. అలాంటి మైదానాన్ని కూటమి సర్కార్ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం వినియోగానికి ఇబ్బందిగా మారింది. అలాగే ప్రహరీ కూడా లేకపోవడంతో స్థానికులు మైదానాన్ని ఆక్రమించేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే మరి కొందరు గ్రౌండులోని మట్టిని తవ్వేసి తీసుకుపోతుండడంతో గోతులమయంగా మారింది. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి మైదానాన్ని బాగు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరాడ రామకృష్ణ, ఎండ మణకంఠ, యోగి, సాసుమాల ఈశ్వరరావు, ప్రసన్న, వికాస్, వెంకటరమణ, దేవా, మురళి తదితరులు విజ్ఞప్తి చేశారు.

ప్రహరీ నిర్మించాలి



మందసలోని మైదానాన్ని తక్షణమే బాగు చేయించాలి. ఈ మైదానంలోనే ప్రాక్టీస్ చేసి ఇటీవల విడుదలైన పోలీస్ ఉద్యోగాల్లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఇటువంటి మైదానంలో 800 మీటర్ల ట్రాక్ ఉంటే క్రీడాకారులకు ఎంతగానో ఉపయోపడుతుంది. మైదానం చుట్టూ ప్రహరీని నిర్మించాలి.

–మట్ట వికాస్, మందస

అస్తవ్యస్తంగా ఉంది..



రోజూ క్రమం తప్పకుండా గ్రౌండుకు వస్తుంటాను. ఇటీవల విడుదలైన పోలీస్ శాఖ పరీక్షలలో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. మైదానంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అస్తవ్యస్తంగా మారింది. మైదానం శుభ్రం కోసం క్లినింగ్ మిషన్‌ను ప్రభుత్వం కేటాయిస్తే బాగుంటుంది.

–సారత మురళి, జిల్లుండ గ్రామం, మందస మండలం

• వంచన చంద్రబాబు నైజం



సోంపేట: బారువ గ్రామంలో క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు తదితరులు



కవిటి: శిలగాంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్ తదితరులు

ప్రజలను వంచించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ఆయనకు అలవాటు లేదని విమర్శించారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి సర్కార్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో కూడిన క్యూఆర్ కోడ్ పత్రాలను పంపిణీ చేశారు. అలాగే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కవిటి: బోధనకు ప్రతిబంధకంగా మారిన మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ వర్క్‌లతో కూడిన బోధనేతర పనిభారాన్ని తగ్గించి ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్ కోరారు. మండలంలోని వివిధ జెడ్పీ పాఠశాలల్లో సంఘం ప్రతినిధులు బుధవారం పర్యటించారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన డీఏ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని కోరారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బల్లెడ రవి, జిల్లా జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మాదక ద్రవ్యాల కోసం విస్తృతంగా తనిఖీలు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాలు, దుకాణాల్లో మాదక ద్రవ్యాల కోసం బుధవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన పోలీసు జాగిలం టీంతో పాటు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, ఏఎస్సై ప్రకాష్ పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఇటీవల గంజాయి ముఠాలు పోలీసులకు దొరకడంతో మార్కెటులో విస్తృతంగా ఈ తనిఖీలు చేపట్టామని కాశీబుగ్గ సి.ఐ సూర్యనారాయణ చెప్పారు.